జాతీయ తెలుగు దినపత్రిక

RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

తెలుగు పత్రికా రంగంలో నూతనంగా అడుగుపెట్టి విశేష ప్రజాదరణతో ముందుకు సాగుతున్న మన 'సందేశం టైమ్స్' తెలుగు దిన పత్రికలో పని చేయుటకు రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్స్ కావలెను. అలానే మండల స్థాయి రిపోర్టర్స్ కావలెను.కొత్త వారికీ అవకాశం కలదు

ఎడిటర్ : 90520 45435

PUBLISHED: TG & AP | సంపుటి : 1 | సంచిక: 61 | మంగళవారం 22 జూలై 2025 | పేజీలు : 8 | వెల 2 /-

Published from :Adilabad, Bhadradri Kothagudem, Hanumakonda, Hyderabad, Jagtial, Jangaon, Jayashankar Bhupalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahbubnagar, Mancherial, Medak, Medchal-Malkajgiri, Mulugu, Nagarkurnool, Nalgonda, Narayanpet, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Ranga Reddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal, and Yadadri Bhuvanagiri.

## 24న హస్తినకు రేవంత్,భట్టి



హైదరాబాద్,జూలై 21(సందేశం టైమ్స్) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జులై 24న ఢిల్లీకి వెళ్లనున్నారు. పార్లమెంట్ వర్షాకాలం సమావేశాలు జరుగుతున్న వేళ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి రేవంత్ రెడ్డి ఢిల్లీలో పర్యటించబోతున్నట్లు కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి తెలిపారు.కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో సమావేశం అవుతారని అదే రోజు సాయంత్రం ఏఐసీసీ జాతీయ కార్యాలయం ఇందిరాభవన్ లో కాంగ్రెస్ ఎంపీలకు రాష్ట్రంలో నిర్వహించిన కులగణన సర్వేలో అవలంభించిన విధానాలు, బీసీలకు 42 శాతం శాతం రిజర్వేషన్ల అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు.కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్న బీసీ రిజర్వేషన్ల బిల్లుల విషయంలో రేవంత్ రెడ్డి ప్రధానిని కలవబోతున్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది.

## మూఢనమ్మకం మత్తులో గ్రామస్థులు స్వామిజీ సూచనతో వనవాసం

నల్లగొండ,జూలై 21(సందేశం టైమ్స్) : వరుసగా ఒకరి తరువాత వకరు చనిపోతున్నారు దశదినకర్మ పూర్తికాక ముందే మరొకరు మృతి చెందడం ఇలా రెండు నెలలుగా జరుగుతోంది. దీనికి తోడు వర్షాలు లేకపోవడంతో గ్రామానికి కీడు సోకిందని గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ఇదీ తక్కెళ్లపహాడ్ గ్రామస్తుల పరిస్థితి! వానాకాలం సీజన్ ప్రారంభంలో పత్తితోపాటు మెట్టపంటలను కూడా గ్రామస్తులు సాగు చేశారు. అయితే వర్షాలు లేక విత్తిన పత్తి విత్తనాలు మొలకెత్తక.. రెండు మూడుసార్లు విత్తారు. భూగర్భ జలాలు అడుగంటి నారుమళ్ళ ఎండిపోతున్నాయి. ఒకవైపు వరస మరణాలు, మరోవైపు వర్షాలు రాకపోవడంతో ఏం చేయాలో తెలియక గ్రామస్తులు తలలు పట్టుకున్నారు. చేసేదేమిలేక చివరకు గ్రామస్తులంతా కలిసి నకిరేకల్ లోని ఓ స్వామీజీని కలిశారు. గ్రామంలో వరుస మరణాలు సంభవించడం.. వర్షాలు కురవకపోవడానికి కీడే కారణమని చెప్పారు. కీడు పోవాలంటే గ్రామస్తులందరూ ఊరు విడిచి వెళ్లి.. ఓ ప్రాంతంలో కీడు వంటలు వండుకోవాలని.. స్వామీజీ గ్రామస్థులకు సూచించారు.

## ఆ జీవో ను నిలిపివేసిన రేవంత్ ఆదివాసీల సంబరాలు

హైదరాబాద్,జూలై 21(సందేశం టైమ్స్) : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్‌లోని ఆదివాసీలకు శుభవార్తను అందించింది. 'కొమురంభీమ్ కన్జర్వేషన్ కారిడార్' ఏర్పాటు కోసం జారీ చేసిన జీవో 49ని ప్రభుత్వం నిలుపుదల చేసింది. జీవో 49పై స్థానిక ఆదివాసీలలో అనుమానాలు, ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని జీవోను నిలుపుదల చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ పురోగతిపై రేవంత్ సమీక్ష



హైదరాబాద్,జూలై 21(సందేశం టైమ్స్) : తెలంగాణ రైజింగ్-2047పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఇందుకు అనుగుణంగా అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్స్ అభివృద్ధి, పురోగతిపై అధికారులతో కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నేడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులు, శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఏటీసీల అభివృద్ధి, పనుల్లో పురోగతిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత సమయానికి అనుగుణంగా వీలైనంత త్వరగా ఏటీసీల అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి. ఏటీసీల అభివృద్ధి, పురోగతిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని సీఎం వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో మూడు దశల్లో 111 ఏటీసీలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు అధికారులు. ఫేజ్-1లో 25, ఫేజ్-2లో 40, ఫేజ్-3లో 46 ఏటీసీలని అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ఫేజ్-1, ఫేజ్-2లో ఇప్పటి వరకు 49 ఏటీసీలు అందుబాటులోకి వచ్చాయని వెల్లడించారు అధికారులు. ఏటీసీలను వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైతే నైపుణ్యం కలిగిన నిర్మాణ సంస్థల సహకారం తీసుకోవాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి. జీనోమ్ వ్యాలీలో ఒక మోడల్ ఏటీసీని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు ముఖ్యమంత్రి. ఫార్మా, బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్ పరిశ్రమలకు అవసరమైన శిక్షణ అందించే కోర్సులు అక్కడ నిర్వహించాలని సూచించారు. అవసరమైన స్థలం కేటాయింపుతో పాటు అధునాతన సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ కసరత్తు



హైదరాబాద్,జూలై 21(సందేశం టైమ్స్) : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు నిర్ణయించారు. కోర్టు ఆదేశాల నేపథ్యంలో త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రభుత్వ నిర్వహించే అవకాశం ఉందని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ సమావేశాలతో స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులను సంసిద్ధం చేయాలని పార్టీ నేతలను ఆదేశించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు తమ జిల్లాల్లోని ప్రతీ నియోజకవర్గ కేంద్రంలో ఈ సమావేశాలు నిర్వహించేలా సమన్వయం చేసుకోవాలని సూచించారు.

ఈ సమావేశాల్లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్లు, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ లు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సీనియర్ నేతలు పాల్గొనాలన్నారు

కేటీఆర్.తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీను అమలు చేయకుండా కాంగ్రెస్ చేస్తున్న మోసాలతో పాటు రేవంత్ ప్రభుత్వ అవినీతి, అప్రజాస్వామిక విధానాలు, వైఫల్యాలను గ్రామగ్రామాన విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు కేటీఆర్. రైతు బంధు ఇవ్వకుండా అన్నదాతలకు రేవంత్ సర్కార్ చేసిన ద్రోహాన్ని ప్రజలకు వివరించాలన్నారు.

## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్ ప్రశాంతం

### జీవో 49 రద్దు చేయాలని ఆదివాసీ సంఘాల డిమాండ్
### డిపోలకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
### మూతపడిన వ్యాపార దుకాణాలు

ఉమ్మడి ఆదిలాబాద్ జూలై 21(సందేశం టైమ్స్) : టైగర్ కారిడార్ పేరిట గిరిజనులు, గిరిజనేతరులు హక్కులకు విఘాతం కలిగించే జీవో 49 వెంటనే రద్దు చేయాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేశాయి. ఆసిఫాబాద్ , కాగజ్‌నగర్ అటవీ డివిజన్ లో 339 గ్రామాలపై ప్రభావం చూపే జీవో నెంబర్ 49 ను వ్యతిరేకిస్తూ ఉమ్మడి అదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా చేపట్టిన బంద్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం ఉదయం నుండి ఆదివాసీ సంఘాల ప్రతినిధులు ఆదిలాబాద్, ఉట్నూర్, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోల ఎదుట బైఠాయించి ఆర్టీసీ బస్సులను అడ్డుకున్నారు. గిరిజన ప్రాంతాల్లో అటవీ అధికారుల పెత్తనం సహించేది లేదని నినాదాలు చేశారు.

తెల్లవారుజాము నుంచే

ఆదిలాబాద్ ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉదయం 4 గంటలకే ఆదివాసి హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆదివాసులు బైఠాయించారు. బస్సులను కదలిని ఇవ్వకుండా అడ్డుకోవడంతో వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు నిలిచిపోయాయి. ఉట్నూరు, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ లో ఆర్టీసీ బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. మధ్యాహ్నం 12గంటల నుండి ఆర్టీసీ బస్సులు యధావిధిగా రోడ్డు ఎక్కాయి. మధ్యాహ్నం వరకు దుకాణాలు, వ్యాపార సంస్థలు మూసి ఉంచగా, ఆ తర్వాత తెరుచుకున్నాయి. పోలీసులు ముందు జాగ్రత్త చర్యగా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. బంద్ ప్రశాంతంగా ముగియడంతో ఊపిరి పీల్చుకున్నారు.

## పాలనలో అన్నింటా సీన్ రివర్స్ భూముల ధరలూ డమాల్ – హరీశ్ రావు

హైదరాబాద్,జూలై 21(సందేశం టైమ్స్) :ఒకప్పుడు తెలంగాణలో ఎకరా భూమి అమ్మితే ఏపీలో పదేకరాల భూమి వచ్చేదని.. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక సీన్ రివర్స్ అయిందని మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఎద్దేవా చేశారు. ఏపీలో ఎకరా అమ్మితే ఇప్పుడు తెలంగాణలో రెండెకరాల భూమి వస్తుందని.. సీఎం రేవంత్ రెడ్డికి పాలన చేతకాక మన దగ్గర ఇలాంటి పరిస్థితి వచ్చిందనిమండిపడ్డారు. తెలంగాణలో మళ్ళీ కేసీఆర్ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. సిద్ధిపేట జిల్లాపై కాంగ్రెస్ పార్టీ పగపట్టిందని హరీష్ రావు పేరొన్నారు.ప్రజ్ఞాపూర్‌లో గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల విస్తృతస్థాయి సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ, 'కాంగ్రెస్ 20 నెలల పాలనలో రాష్ట్రం అధోగతి పాలైంది. కాంగ్రెస్ పాలనలో ప్రజలు స్వీయ అనుభవం చెందారు. రేవంత్ రెడ్డి చేసిన మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు



ఇస్తామని నిరుద్యోగులను కాంగ్రెస్ పార్టీ రెచ్చగొట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఒక్కరికి కూడా పెన్షన్ ఇవ్వలేదు కానీ 2 లక్షల పెన్షన్లు తీసేశారు. కాంగ్రెస్ పాలనలో ఎరువుల కోసం చెప్పులు క్యూలైన్లో పెట్టాల్సిన పరిస్థితి వచ్చింది. కేసీఆర్ హయాంలో నాట్లకు, నాట్లకు రైతు బంధు వచ్చేది. రేవంత్ రెడ్డి హయాంలో ఓట్లకు, ఓట్లకు మధ్య రైతు భరోసా వస్తుంది. కాంగ్రెస్ వచ్చాక బోరు బావుల మోటర్ల మెకానిక్కు మాత్రమే బాగుపడ్డారు' అని అన్నారు.

# సంపాదకీయం

## కొత్త సాహిత్య వారధి విదేశీ సిరీస్

ఛాయా పబ్లికేషన్స్ సంస్థ 'విదేశీ సిరీస్' పేరుతో రానున్న రెండున్నర ఏళ్ళలో పదిహేను అంతర్జాతీయ భాషల నుంచి 25 పుస్తకాలను తెలుగులోకి అనువదించి తేనుంది. ఇప్పటికే ఆయా ప్రచురణకర్తలతో ఒప్పందాలు పూర్తయ్యాయి. ఈ సిరీస్‌లో ఒర్హాన్ పాముక్, హాన్ కాన్ వంటి నోబెల్ గ్రహీతల పుస్తకాలతోపాటు, బుకర్ ప్రైజ్ పొందిన రచయితల పుస్తకాలు కూడా ఉన్నాయి. ఈ ప్రయత్నం గురించి ఛాయా పబ్లికేషన్స్ సంస్థ సీఈవో అరుణాంక్ లతతో వివిధ జరిపిన సంభాషణ ఇది. ఈ 'విదేశీ సిరీస్' ఆలోచన ఎలా కలిగింది, దీని ఉద్దేశం ఏమిటి? సమకాలీన ప్రపంచ సాహిత్యం తెలుగులోకి రావడం ఆగిపోయి దశాబ్దాలు గడుస్తోంది. ఈ లోటును తీరుస్తూ ఆ సాహిత్యాన్ని సామాన్య పాఠకులకు చేరువ చేసే ఉద్దేశ్యంతో ఈ సిరీస్‌ను ప్రారంభించాము. కొందరికే అందుబాటులో ఉండే ప్రపంచ సమకాలీన సాహిత్యాన్ని మారుమూల తెలుగు పాఠకులకు చేరవేయడం దీని లక్ష్యం. ఇందులో పుస్తకాల్ని, రచయితల్ని ఏ ప్రాతిపదిక మీద ఎంపిక చేసుకున్నారు? ఒకే జానర్ కాకుండా వేర్వేరు థీమ్స్, జానర్ల నుండి తీసుకున్నాం. రచయితలూ, అనువాదకులూ అందరూ ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా పేరు ప్రఖ్యాతలున్నవారే. ముఖ్యంగా ఈ జాబితాలో బుకర్, బుకర్ ఇంటర్నేషనల్ బహుమతి పొందిన పుస్తకాలు, నోబెల్ బహుమతి పొందిన రచయితలూ ఉండేలా చూసుకున్నాం. వీటిలో బుకర్ బహుమతి పొందిన ఇంగ్లీష్ నవల 'ప్రాఫెట్ సాంగ్' (2023)తో మూడు బుకర్ ఇంటర్నేషనల్ బహుమతులు పొందిన నవలలు: కొరియన్ నవల 'ది వెజిటేరియన్' (2016), డచ్ నవల 'డిస్‌కంఫర్ట్ ఆఫ్ ది ఈవెనింగ్' (2020), జర్మన్ నవల 'కైరోస్' (2024)తో అలాగే, ముగ్గురు నోబెల్ రచయితల పుస్తకాలు: నార్వేజియన్ రచయిత యాన్ ఫోసే నవల 'షైనింగ్' (2023), టర్కిష్ రచయిత ఒరాన్ పాముఖ్ నవల 'మై నేమ్ ఈజ్ రెడ్' (1998), కొరియన్ రచయిత హాన్ కాంగ్ నవలలు 'ది వెజిటేరియన్' (2016), 'వీ డు నాట్ పార్ట్' (2025) ఉన్నాయి. వీటిలో రెండు పుస్తకాలు మినహాయిస్తే మిగతావన్నీ గడచిన ఇరవై ఏళ్ళలో వచ్చినవే. ప్రచురణకర్తలతో ఒప్పందాలు సులభం గానే జరిగాయా? ఆయా ప్రచురణకర్తలు ఇలాంటి ఒప్పందాల విషయంలో ఏ అంశాలపై దృష్టి పెడతారు, ఇందులో ఆయా రచయితల పాత్ర ఎంతవరకు? హక్కులు అనేది కాస్త క్లిష్టమైన వ్యవహారమే. ఒక పుస్తకం మనం తీసుకోవాలి అని అనుకున్న తరువాత దాన్ని డీల్ చేసే సంస్థ ఏది అనేది వెతుక్కోవడం కూడా పెద్ద విషయమే. ఎక్కువగా విదేశీ రచయితలకు లిటరరీ ఏజెంట్స్ ఉంటారు. కొందరిని లిటరరీ ఏజెన్సీలు రిప్రజెంట్ చేస్తాయి. ఆ ఫలానా ఏజెన్సీలో తనను రిప్రజెంట్ చేసే ఏజెంట్ ఒకరు ఉంటారు. ఇవన్నీ కనుక్కుని వాళ్ళ ఈమెయిల్ ఐడీ తీసుకున్నాక వారికి రాసిన మెయిల్‌కి స్పందిస్తారని లేదు. వాళ్ళు చాలామందిని చూసుంటారు గనుక ఎక్కువ మంది మొదటి మెయిల్‌కే స్పందించరు. దానికి తోడు, మనం వేసే పుస్తకాల సంఖ్యా, మనం ఆఫర్ చేసే డబ్బులూ వాళ్ళకి పెద్ద విషయంలా అనిపించదు. రిపీటెడ్‌గా రాస్తే తప్ప ఈ ప్రపోజల్స్ వర్కవుట్ అవ్వవు. ఇందులో ఒకటీ రెండు ఈమెయిల్స్‌కే ఒప్పుకున్న వాళ్ళున్నారు, పదుల సంఖ్యలో ఈమెయిల్స్ రాస్తే తప్ప స్పందించనివాళ్ళు ఉన్నారు. వాళ్ళు ప్రధానంగా ఎన్ని పుస్తకాలు వేస్తున్నారు, ఏ రకంగా వేస్తున్నారు అనే దానిపై దృష్టి పెడతారు. పుస్తకం పేపర్ బ్యాక్, హార్డ్ బౌండ్, ఆడియో రైట్స్ వేటికవే ప్రత్యేకంగా హక్కులు తీసుకోవాల్సిందే. ప్రచురణ సంస్థ గురించిన ఒక సవివరమైన పరిచయం కూడా వాళ్ళు తెలుసుకునేందుకు ఇష్టపడతారు. ఈ మొత్తం ప్రక్రియలో రచయితల పాత్ర దాదాపు ఉండదు అనే చెప్పొచ్చు. వారి తరఫున ఇదంతా నెగోషియేషన్స్ ఏజెంట్స్ నిర్వహిస్తారు. కాంట్రాక్ట్‌లో సంతకం చేయడం మాత్రమే రచయిత పని. ఎందుకంటే గత ఏడాది బుకర్ ఇంటర్నేషనల్ వచ్చిన రచయిత్రి జెన్నీ ఎర్పెన్‌బెక్‌, 2023 బుకర్ వచ్చిన పాల్ లించ్‌ని ప్రత్యక్షంగా కలిసినా కూడా వాళ్ళు తమ ఏజెంట్స్ తోనే మాట్లాడమని చెప్పారు. ఈ సిరీస్‌లో అరబిక్, ఫిన్నిష్, ఐస్‌లాండిక్, కొరియన్, నార్వేజియన్, రష్యన్ తదితర భాషల పుస్తకాలు ఉన్నాయి. వీటన్నిటి అనువాదమూ వయా ఇంగ్లీష్ అనువాదాల నుంచే జరుగుతున్నదా? రెండు పుస్తకాలు మినహా మిగతావన్నీ వయా ఇంగ్లీష్ నుంచి చేస్తున్నవే. అయితే, ఇంగ్లీష్ అనువాదకుల నుంచి వారి అనువాదాన్ని వాడుకునేందుకు హక్కులు తీసుకుంటున్నాం. ఇలా వాళ్ళని సంప్రదించడం చాలా అరుదైన విషయమనీ, చాలా భాషల్లోకి వారి అనువాదాలను ఉపయోగించే చేస్తున్నా కనీసం వారి పేరు కూడా పేర్కొనడం లేదని వారు అన్నారు. తమ అనువాద హక్కుల గురించి ఇప్పుడు వారంతా బయటకి వచ్చి సంఘటితం అవుతున్నారు. రెండు తప్ప వీటిలో ఏ నవలా మూల భాష నుంచి నేరుగా రానప్పుడు తెలుగు అనువాదం మూలానికి మరీ దూరంగా జరిగే అవకాశం లేదా? మూలం నుండి దూరం జరగకూడదు అనే ఉద్దేశ్యంతో ప్రముఖ ప్రచురణ సంస్థలు వేసిన పుస్తకాలను, అనువాదకుల ప్రొఫైల్ని గమనంలో పెట్టుకునే పుస్తకాలను ఎన్నుకున్నాం. వీరంతా ప్రతి పుస్తకం ఐదారు సార్లు, కొందరు ఇంకా ఎక్కువ సార్లు ఎడిట్ చేస్తారు. తరచి తరచి చూసిన తర్వాతే ఈ పుస్తకాలు బయటకు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఇంగ్లీష్ లోకి వచ్చేటప్పుడు 'ట్రాన్స్‌లేషన్ లాస్' తక్కువ గనుక తెలుగులో ఆ సమస్య ఉండదనే అనుకుంటున్నాం. తెలుగు అనువాదకుల ఎంపిక ఎలా జరుగుతోంది? అనువాదాల శైలి విషయంలో ఏమైనా నియమాలు విధించుకున్నారా? ఈ సిరీస్ ద్వారా కొత్త అనువాదకులను పరిచయం చేస్తున్నాం. ఇప్పటికే అనువాదం చేసిన నలుగురు అనువాదకుల అనువాదాలను చూసి వారికి కొన్ని పుస్తకాలు ఇచ్చాం.

# బనకచర్ల సాంకేతిక కమిటీలోకి రాష్ట్రం నుంచి ముగ్గురు

అమరావతి, జూలై 21 (సందేశం టైమ్స్): పోలవరం-బనకచర్ల అనుసంధాన పథకంపై అధ్యయనం కోసం కేంద్ర జలశక్తి శాఖ వేయనున్న 12 మందితో కూడిన సాంకేతిక, నిపుణుల కమిటీలోకి రాష్ట్రం నుంచి ముగ్గురు అధికారుల పేర్లను ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఈ పథకంపై అధ్యయనం కోసం కమిటీని వేయాలని కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డితో నిర్వహించిన సమావేశం తీర్మానించింది. ఈ నేపథ్యంలో కమిటీలో నియమించే సభ్యుల పేర్లను ప్రతిపాదించాలని ఇరు రాష్ట్రాలను కోరుతూ కేంద్ర జలశక్తిశాఖ శనివారం లేఖ పంపింది. దీంతో ఈ పథకంపై సంపూర్ణ అవగాహన కలిగిన జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ఆ శాఖ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఆ శాఖ ఇంజనీర్ ఇన్‌చీఫ్ నరసింహమూర్తి పేర్లను మంగళవారం నాటికి అధికారికంగా ఖరారు చేసి పంపాలని జలవనరుల శాఖ



నిర్ణయించింది. కాగా, పోలవరం ప్రాజెక్టు బృందం ఆదివారం రాజమండ్రికి చేరుకుంది. సోమవారం పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో ఈ బృందం పర్యటించి, జలాలపై అధ్యయనం చేయనుంది.

# ఔషధ నిరోధకతపై ఉన్నతస్థాయి కమిటీ




గుంటూరు మెడికల్‌జూలై 21 (సందేశం టైమ్స్): ప్రజారోగ్య సంరక్షణకు ఔషధ నిరోధకత(యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్-ఏఎంఆర్) సవాల్‌గా మారుతోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఔషధ నిరోధకత కట్టడి చర్యలకు, యాంటీ బయోటిక్ మందుల విచ్చలవిడి వినియోగం తగ్గించేందుకు ప్రభుత్వ, ప్రైవేటు వైద్యనిపుణులతో కలిపి ఉన్నతస్థాయి కమిటీని నియమించనున్నట్లు మంత్రి ప్రకటించారు. గుంటూరు వైద్య కళాశాలలోని జింఖానా ఆడిటోరియంలో ఆదివారం ఏఎంఆర్ ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా యాంటీ బయోటిక్ ఔషధ నిరోధకత ఏ మేరకు ఏర్పడిందో తెలుసుకునేందుకు గుంటూరు రిఫరల్ లేబొరేటరీ కేంద్రంగా అధ్యయనం చేసేందుకు మంత్రి సమక్షంలో ఐఎంఏ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ గార్లపాటి నందకిశోర్‌తో సైంటిస్ట్ సందీప్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. తన సొంత ఖర్చులతో ఈ రిసెర్చ్ స్టడీ చేసేందుకు ముందుకు వచ్చిన దాత, సైంటిస్ట్ సందీపను మంత్రి సత్యకుమార్ అభినందించారు. ఈ సందర్భంగా క్లినికల్ ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్ సొసైటీ(సిడ్స్)రాష్ట్ర అధ్యక్షుడు, రిసెర్చ్ స్టడీ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ డాక్టర్ కె.కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ విశాఖపట్నం, గుంటూరు, తిరుపతిలో ఎంపిక చేసిన రోగుల నుంచి బ్లడ్ శాంపిల్స్‌ను గుంటూరులోని రీసెర్చ్ ల్యాబ్‌లో పరీక్షిస్తామన్నారు. మూడు నెలల వ్యవధిలో ఈ ల్యాబ్ టెస్ట్‌లు పూర్తి చేసి వచ్చిన ఫలితాలపై నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు. రాష్ట్రంలో 9 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలందరికీ సర్వైకల్, మెడ క్యాన్సర్ నివారణకు హ్యూమన్ పాపిలోమా వైరస్ (హెచ్‌పీవీ) వ్యాక్సిన్‌లు ఉచితంగా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. దేశంలో ప్రతిరోజూ 1,600 మంది మహిళలు గర్భస్థ ముఖద్వార క్యాన్సర్‌తో మృతి చెందుతున్నట్లు తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఈ క్యాన్సర్ నివారణ కోసం రాష్ట్రంలో 9-14 ఏళ్లలోపు పిల్లలకు ఉచితంగా హెచ్ పీవీ వ్యాక్సిన్ ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# ఎల్లెల్సీ కాలువలోకి దూసుకెళ్లిన కారు

## యువకుడు మృతి.. మరొకరు గల్లంతు
## కర్నూలు జిల్లా కౌతాళంలో ప్రమాదం

కౌతాళం/ఎమ్మిగనూరు, జూలై 21 (సందేశం టైమ్స్): తుంగభద్ర ఎల్లెల్సీ (లో లెవల్ కెనాల్)లోకి కారు దూసుకెళ్లడంతో ఒక యువకుడు మరణించాడు. మరో యువకుడు గల్లంతయ్యాడు. కర్నూలు జిల్లా కౌతాళం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కర్ణాటకలో హుబ్లీకి చెందిన సునీల్(21), మణికంఠ, హైదర్, మంజునాథ్, అప్పయ్య, అభిషేక్ అక్కడి ఒక కంపెనీలో కార్మికులుగా పనిచేస్తున్నారు. శని, ఆదివారాల్లో సెలవు కావడంతో రాఘవేంద్రస్వామి దర్శనం కోసం కారులో మంత్రాలయానికి వచ్చారు. రాత్రి స్వామివారి దర్శనం చేసుకున్నారు. కొప్పల్ సమీపంలోని గవి మఠాన్ని సందర్శించుకొని అక్కడినుంచి హుబ్లీకి చేరుకోవాలని మధ్యాహ్నం బయలుదేరారు. కౌతాళం వద్ద వారు ప్రయాణిస్తున్న కారు ఎల్లెల్సీలోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో కాలువగట్టుపై భోజనం చేస్తున్న వ్యవసాయ కూలీలు గొల్లయ్య, గోవర్ధన్, రమేష్ వెంటనే కాలువలోకి దిగి అప్పయ్య, మంజునాథ్, హైదర్, అభిషేక్‌లను కాపాడారు. అప్పటికే సునీల్,



మణికంఠ గల్లంతయ్యారు. పోలీసులు ఎక్స్‌కవేటర్ సాయంతో కారును బయటకు తీయించారు. గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా సునీల్ మృతదేహం లభించింది. మణికంఠ కోసం గాలింపు కొనసాగుతోంది. సునీల్ మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌కుమార్ తెలిపారు.

# నిమ్మ ధర పైపైకి..


## సీతంపేట సంతకు గిరిజనులు తీసుకొచ్చిన నిమ్మకాయల బస్తాలు
## గిరిజన రైతుల్లో ఆనందం

సీతంపేట రూరల్, జూలై 21 (సందేశం టైమ్స్): ఏజెన్సీలో గిరిజన రైతులు సేకరించే అటవీ ఉత్పత్తుల్లో నిమ్మ పంట ఒకటి. అయితే గడిచిన కొద్ది వారాలుగా నిమ్మకాయలకు ఆశించిన స్థాయిలో మద్దతు ధర రాలేదు. దీంతో గిరిజన రైతులు ఆవేదన చెందారు. ప్రస్తుతం సీన్ మారింది. సీతంపేట వారపు సంతలో నిమ్మకాయలకు డిమాండ్



పెరిగింది. వాటిని కొనేందుకు మైదాన ప్రాంత వ్యాపారులు పోటీ పడ్డారు. గత వారం 45కేజీల నిమ్మకాయల బస్తా ధర రూ.450లు ఉండగా.. నేడు రూ.750కు చేరింది. ఒక్కసారిగా ధర పెరగడంతో గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కష్టానికి తగ్గ ప్రతిఫలం లభించిందనే సంతోషంతో ఇంటిదారి పట్టారు.

# డిప్లమో కోర్సుల వెబ్ ఆప్షన్ల గడువు పెంపు



అమరావతి, జూలై 21 (సందేశం టైమ్స్): ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నిర్వహించే అగ్రికల్చర్ డిప్లమో కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవటానికి ఆఖరి తేదీని ఈనెల 25 వరకు పొడిగించారు. ఈ మేరకు రిజిస్ట్రార్ రామచంద్రరావు ఓ ప్రకటనలో తెలిపారు. తిరుపతిలోని వ్యవసాయ కళాశాలలో డిప్లమో కోర్సులో ప్రవేశానికి అనుమతినిస్తున్నట్లు పేర్కొన్నారు. 2025-26 సంవత్సరానికి తిరుపతిలో కూడా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఇస్తున్నట్లు వివరించారు.

# యాండే.. పుల'సండే'!





◆ యానాంలో ఇటీవల రూ.18 వేలకు విక్రయించిన పులస
◆ గోదారి ఎర్రనీట్లో సందడి చేస్తోన్న పులస చేప
◆ గతంతో పోల్చితే ఇవి అరుదుగా దొరుకుతుండడంతో భారీ ధర
◆ ఇటీవల రూ.18 వేలు పలికిన కేజీన్నర చేప..
◆ గతేడాది ఏకంగా రూ.25 వేలు
◆ సీజన ప్రారంభమవడంతో ఈ దఫా అయినా భారీగా దొరికేనా అని మత్స్యకారుల్లో ఆశ

జూలై 21 (సందేశం టైమ్స్): పులస... పులసోయ్ పులస... నోరూరించే పులస.. పుస్తెలమ్మయినా కొనుక్కుని తినాల్సిన పులస.. సాధారణంగా ఏ స్వీట్లు గురించో వింటే ఠక్కున నోరూరుతుంది.. చేపల్లో పులస గురించి వింటే జిహ్వాచాపల్యం ఆగదు.. ఎలాగైనా.. ఎంత పెట్టి కొని అయినా తినాలనిపించే ఈ చేప గురించి ఎంత చెప్పినా తక్కువే.. వర్షాకాలం వస్తే గోదావరికి ఎర్రనీరు ఎలా పోటెత్తుతుందో... పులస కూడా అలా సముద్రం నుంచి గోదావరికి ఎదురీది పులస ప్రియుల నోట్లోకి జారుతుంది.. సాధారణంగా చికెన..మటన.. చేప తింటే బయటకొచ్చి దీని గురించి ఎవరూ పెద్ద గొప్పగా చెప్పుకోరు.. కానీ పులస తిన్నవాళ్లు మాత్రం రోజుల తరబడి ఊరంతా చెప్పుకోవడం ఓ ప్రెస్టేజీ కూడా.. గోదారోళ్లకు మహా ఇష్టమైన...ఖరీదైన.. చుట్టాలు, స్నేహితులకు గొప్ప గిఫ్ట్‌లా పేరొందిన పులస సీజన ఇప్పుడు గోదావరిలో మొదలైంది. భారీ వర్షాలతో వరద పోటెత్తుతుండడంతో ఒక్కో పులస అలా అలా ఈదుకుంటూ పులసప్రియుల నోటికి చిక్కడానికి ఇప్పుడిప్పుడే కదులుతోంది... పదండి... ఇంకా దీని గురించి చెప్పుకుందాం...వానాకాలం వస్తే అందరి నోట్లో నానే పదం పులస. ఇప్పుడు వానాకాలం కావడంతో గోదావరి ఎర్రనీరు సముద్రంలో కలుస్తుండ డంతో పులసల సీజన మొదలైపోయింది. ఇప్పటికే యానాం గౌతమి గోదావరిలో అక్కడక్కడా పులసలు దొరుకుతున్నాయి. ఇటీవల యానాం మార్కెట్‌లోకి పలువురు వ్యాపారులు పులసలను తెచ్చి విక్రయించారు. వేలు ఖర్చుపెట్టి మరీ ఈ చేపలు కొనేందుకు ఎగబడ్డారు. వాస్తవానికి పుస్తులమ్మయినా పులస తినాలి అనేది గోదావరి జిల్లాల్లో పులస చేప కోసం వినబడే నానుడి. ఎందుకంటే దీని ధర ఎంతకు ఎగబాకుతుందో ఎవరికీ తెలియదు. చేపలను మార్కెట్లో ఇలా వెళ్లి అలా తెచ్చుకోవచ్చు.. కానీ పులసను మాత్రం వేలంలోకి వెళ్లి తెచ్చుకోవాలి. ఎందుకంటే దీనికి ఉన్న గిరాకీ అంత మరి. ధన వంతుల నుంచి సెలబ్రిటీల వరకు... మధ్యతరగతి నుంచి సామా న్యుల వరకు పులస వచ్చిందా.. పులస దొరుకుద్దా.. అంటూ ఈ సీజ నలో ఆరా తీయడం మామూలుగా ఉండదు. చాలామంది తమ పనుల కోసం ప్రముఖులను ప్రసన్నం చేసుకునేందుకు, కావాల్సిన పనులను చేయించుకునేందుకు ఈ పులస పులును పంపడం ఓ అనవాయితీగా మారింది. అంతేకాదండోయ్.. ఈ సీజనలో విదేశాల్లో ఉన్న గోదావరివాసులు తమ వారితో సరదాగా పులస దొరికిందా.. పులస తిన్నారా అని అడగకుండా ఉండరంటే అతిశయోక్తికాదు.అవును.. పులసే తినాలి... ఇది తింటే ఆ రుచే వేరు.. వాస్తవా నికి ఇవి వెండి రంగులో ఉంటాయి. ఆరోహక వలస జాతికి చెం దిన పులసలు సా?ధారణంగా సముద్రంలో జీవిస్తాయి. అయితే సంతాన ఉత్పత్తి కోసం ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, టాంజానియా వంటి సుదూర ప్రాంతాల నుంచి వచ్చి హిందూ మహాసముద్రంలో ప్రవేశించి అక్కడ నుంచి బంగాళాఖాతం గుండా వరదల సమయంలో గోదావరిలోకి వచ్చి చేరతాయి. గోదావరి వరదనీరు వచ్చి సముద్రంలో కలిసే సమయంలో గుడ్లు పెట్టిన తర్వాత అక్టో బర్ నాటికి తిరిగి సాగరానికి చేరుకుంటాయి. అలా వెళ్లే క్రమంలో జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో వరదలు వచ్చినప్పుడు కొన్ని చేపలు సముద్రం నుంచి గోదారిలో ఎదురీదుకుంటూ వెళ్తూ జాలర్లకు చిక్కుతాయి. పూర్వం సముద్రంలోంచి ఈదుకుంటూ ధవళేశ్వరం బ్యారేజీ వరకు వెళ్లేవి. బ్యారేజీ దిగువన పులసల్లంక అనే లంక కూడా ఉంది. అరుదైన ఈ పులస చేపలు గోదావరిలో తప్ప ఇంకెక్కడా దొరకవు. అందుకే అంత గిరాకీ. వాస్తవానికి పులస సముద్రంలో ఉంటే విలస చేప.. నదిలో దొరికితే పులస అవుతుం ది. గత పది రోజుల నుంచి గౌతమి గోదావరిలోకి ఎర్రనీరు రావడంతో పులసలు వచ్చి పడుతున్నాయి. వాస్తవానికి ఈ పులస యానాం వద్ద సముద్రం నుంచి ఎగువకు గోదావరిలో ఎగబాకు తూ ధవళేశ్వరం వరకు ఎదురెళ్తాయి. ఈ క్రమంలో ఎక్కడ మత్స్య కారులకు చిక్కుతుందో తెలియదు. చిక్కిందంటే పంట పండినట్టే.నదీ ప్రవాహానికి అతివేగంగా ఎదురీదడం ఈ చేప ప్రత్యేకత. పులస చనిపోయినా రెండు రోజుల వరకు కూడా పాడవకుండా ఉండటం మరో విశేషం. అయితే ఈ పులస చేప ధర వేలం పాట లో పాల్గొన్న వ్యక్తుల ఆధారంగా రేటు పెరుగుతుంది.

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు తల్లికి వందనం నిధులు విడుదల

అమరావతి,జూలై 21 (సందేశం టైమ్స్): ప్రభుత్వ, ప్రైవేట్‌తోపాటు ఎయిడెడ్ పాఠశాలలు, కళాశాలల్లో 9 ,10వ తరగతీ, ఇంటర్మీడియట్ 1, 2వ సంవత్సరం చదువుతున్న షెడ్యూల్డ్ క్యాస్ట్ విద్యార్థులకు తల్లికి వందనం పథకం కింద ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించింది. ఈ పథకం ద్వారా 3.93 లక్షల మంది విద్యార్థులకు ఆర్థిక సహాయంలో 40 శాతం వాటాగా.. రూ. 382.66 కోట్లను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విడుదల చేసింది%అలాగే 9, 10 తరగతుల ఎస్సీ డే- స్కాలర్ విద్యార్థులకు రూ.10,900 మొత్తాన్ని విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలో జమ చేసింది. ఇక 9, 10 తరగతుల ఎస్సీ హాస్టల్ విద్యార్థులకు రూ.8,800 నగదు మొత్తాన్ని ప్రతి విద్యార్థి తల్లి బ్యాంకు ఖాతాలో వేసింది. అదే విధంగా ఇంటర్మీడియట్ 1, 2వ సంవత్సరం చదువుతున్న ఎస్సీ విద్యార్థులకు.. మొత్తం ర్యాంకింగ్ ఆధారంగా 5,200 నుంచి 10,972 పిల్లల తల్లుల ఖాతాలోకి నగదును ప్రభుత్వం మళ్లించింది.ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు సూపర్ సిక్స్ హామీలు ఇచ్చింది. ఆ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. దీంతో ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదికి తల్లికి వందనం పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకానికి నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పథకం ద్వారా 42,69,459 మంది తల్లుల ఖాతాల్లో 67,27,164 మంది విద్యార్థులకు రూ. 15 వేలు చొప్పున నగదు జమ చేస్తున్నారు.అయితే ఈ రూ. 15 వేలల్లో రూ. 2 వేలు జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ఉండే ఖాతాలకు మళ్లించి.. పాఠశాలల నిర్వహణ, అభివృద్ధి, పారిశుద్ధ్యం కోసం వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. ఇక ఈ తల్లికి వందనం నిధులను ఆయా కార్పొరేషన్ల ద్వారా విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే.

## సీతాఫలాలు వచ్చేశాయ్!

సీతంపేట వారపుసంతకు రైతులు తీసుకొచ్చిన సీతాఫలాలు
కేట్ ధర రూ.1000



సీతంపేట రూరల్,జూలై 21 (సందేశం టైమ్స్): మధురఫలంగా పేరొందిన సీతాఫలాల సీజన్ సీతంపేట ఏజెన్సీలో ప్రారంభమైంది. సీతంపేట వారపుసంతకు గిరిజన రైతులు పెద్దఎత్తున పంటను తీసుకువచ్చారు. ఒక్కో కేట్ ధర రూ.1000 వరకు పలికింది. సీజన్ ప్రారంభంలో ధర ఎక్కువగా ఉన్నప్పటికీ మైదాన ప్రాంతానికి చెందిన వ్యాపారులు వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు. వాస్తవంగా ఏటా జూలై నెలాఖరు నుంచి అక్టోబరు వరకు సీతాఫలం పంట సీజన్ నడుస్తుంది. ఈ ప్రాంత గిరిజన రైతులకు ఎంతో లాభం చేకూర్చే పంటల్లో ఇదొకటి. ఏజెన్సీలో పండే సీతాఫలానికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది.

## జ్వరంతో బాలింత మృతి

సీతంపేట రూరల్,జూలై 21 (సందేశం టైమ్స్): మండలంలోని చీడిమా నుగూడ గ్రామానికి చెందిన బాలింత ఆరిక ప్రియాంక(21) జ్వరంతో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. ఈనెల 17న తన స్వగ్రా మం మొగదారగూడ గ్రామానికి బిడ్డతో పాటు ప్రియాంక వచ్చింది. అదే రోజున ఆమెకు జ్వరం రావడంతో తండ్రి బిడ్డిక రాజన్న వైద్యం కోసం సీతంపేట ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు, అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతురాలికి నెల బాబు ఉన్నాడు. ప్రియాంక మృతితో భర్త ఆరిక సుందర్రావు, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు.

## గంట వ్యవధిలో దంపతుల మృతి.. చాట్రాయి మండలం పోలవరంలో విషాదం




చాట్రాయి,జూలై 21 (సందేశం టైమ్స్): ఒకే రోజు గంట వ్యవధిలో భార్యా భర్త అనారోగ్యంతో మృతి చెందడంతో మండలంలోని పోలవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ జీవనం చేస్తున్న తేళ్ళూరి వెంకటేశ్వరరావు(65), తేళ్ళూరి పాప(55) ఒకే రోజు కన్నుమూయడం కుటుంబ సభ్యులు బంధువులు గ్రామస్తులు జీర్ణించుకోలేక పోతున్నారు. పాప కొన్ని నెలల క్రితం కేన్సర్ బారిన పడటంతో ఆమెను బతికించుకోవాలని భర్త, కుమారుడు, కుటుంబ సభ్యులు తాహతును మించి ఖర్చు పెట్టి చికిత్స చేయిస్తున్నారు. ఈ లోగా భర్త వెంకటేశ్వరరావుకు ఊపిరితిత్తులలో సమస్య రావడంతో విజయవాడ ఆసుపత్రిలో చికిత్స చేయిస్తున్నారు. ఈక్రమంలోనే ఆదివారం భార్య పాప పరిస్థితి విషమించి చనిపోయింది. తన కళ్ల ముందే భార్య చనిపోవడంతో కలత చెందిన వెంకటేశ్వరరావు గంట వ్యవధిలోనే తుదిశ్వాస విడిచాడు. ఈ దంపతుల పెద్ద కుమారుడు మూడేళ్ల క్రితం కేన్సర్‌తో మృతి చెందాడు. రెండో కుమారుడు గ్రామంలోనే కూలీ పనులు చేస్తూ తల్లిదండ్రులకు అండగా ఉండగా, కుమార్తె వివాహం చేశారు. భార్యా భర్తలు ఒకే రోజు చనిపోవటంతో కుటుంబ సభ్యులు బంధువులు బోరుబోరున విలపిస్తున్నారు. మృతి చెందిన దంపతులకు సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, వైసీపీ నాయకుడు చెలికాని శ్రీరామ్ దంపతుల భౌతికకాయాలకు శ్రద్ధాంజలి ఘటించి కుటుంబీకులకు సంతాపం తెలిపారు.

## ట్యాంకర్లతో నీటి సరఫరా



మైలవరం,జూలై 21 (సందేశం టైమ్స్): మండల పరిధిలోని రామచంద్రాయపల్లె గ్రామంలో ట్యాంకర్లతో అధికారు లు నీటిని సరఫరా చేశారు. గత కొన్ని రోజులుగా రామచంద్రాయపల్లె గ్రామంలో నీటి సమస్య ఉండడం, గ్రామంలో ఎంతకు పరిష్కారం కాకపోవడంతో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డికి గ్రామస్థులు విషయం తెలుపడంతో ఆయన అధికారులతో మా ట్లాడి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీంతో అధి కారులు ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేశారు



# నిలకడలేని జీడి ధర

**రెండు నెలల్లో రూ.వెయ్యి పతనం**

**ప్రస్తుతం 80కిలోల పిక్కల బస్తా రూ.12,500**

**దళారీ వ్యవస్థతో రైతులకు నష్టాలు**

వజ్రపుకొత్తూరుజూలై 21 (సందేశం టైమ్స్): జీడిపిక్కల ధరల్లో హెచ్చుతగ్గులు చోటు చేసుకుంటున్నాయి. రెండు నెలల్లోనే బస్తాకు రూ.వెయ్యి పతనమైంది. మిగిలిన వాణిజ్య పంటల వలే జీడిపంటకు ధరల స్థిరీకరణ లేకపోవడం ఉద్దానం రైతులకు శాపంగా మారుతోంది. ఎప్పుడు ధర పెరుగుతుందో.. ఎప్పుడు తగ్గుతుందో తెలియక సతమతమవుతున్నారు. పంటను ఎప్పుడు అమ్ముకోవాలో తెలియక నష్టపోతున్నారు. జీడి వ్యాపారాన్ని దళారీ వ్యవస్థ శాసిస్తోందని, ధరలు పెరగకుండా వారే అడ్డుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.జిల్లాలో ఈ ఏడాది 24వేల హెక్టార్లలో జీడి పంట సాగైంది. లక్ష బస్తాల పిక్కలు దిగుబడి ఉంటుందని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు. మే నెలలో 80కిలోల బస్తా ధర రూ.13,500 ఉండగా, ఇప్పుడు రూ.12,500కు పడిపోయింది. రెండు నెలల్లోనే బస్తా ధర రూ.వెయ్యి పతనం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటపై ఆదాయం కంటే మదుపులు, రవాణాకే వ్యయం అధికమవుతోందని వాపోతున్నారు. ధరల స్థిరీకరణ లేకపోవడంతో రానున్న రోజుల్లో కూడా జీడిపిక్కల ధరలు మరింత తగ్గుతాయేమోనని కలవరపడుతున్నారు. జిల్లాలోని పలాసతోపాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న జీడి పరిశ్రమలకు ప్రతి ఏడాదీ 5 లక్షల బస్తాల పిక్కలు(బస్తా 80కిలోలు) అవసరం ఉంటుంది. అయితే, ఈ ఏడాది జిల్లాలో లక్ష బస్తాల దిగుబడి మాత్రమే ఉంటుందని అధికారులు చెబుతున్నారు. దీంతో వ్యాపారులు ఇతర ప్రాంతాలు, దేశాల నుంచి జీడిపిక్కలను దిగుమతి చేసుకుంటున్నారు. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి జిల్లాకు తీసుకొస్తున్నారు. ఇది జిల్లా రైతుల పాలిట శాపంగా మారింది. విదేశీ పిక్కలతో ఉద్దానంలో పండే పంటకు డిమాండ్ తగ్గుతోంది.

# మూడు గంటలు శ్రమించినా.. దక్కని ప్రాణం



పలాస, జూలై 21 (సందేశం టైమ్స్): పలాస బైపాస్ రోడ్డు కోసంగిపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఆగి ఉన్న కోళ్ల వ్యాన్‌ను.. ముడి ఐరన్ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొంది. క్యాబిన్‌లో చిక్కుకుని లారీ డ్రైవర్ మృతి చెందాడు. కాశీబుగ్గ పోలీసులు, హైవే సిబ్బంది మూడు గంటలపాటు శ్రమించి ముడిఐరన్‌ను బయటకు తీసినా ఆ డ్రైవర్ ప్రాణం దక్కలేదు. అలాగే వ్యాన్‌డ్రైవర్, క్లీనర్‌తోపాటు లారీ క్లీనర్‌కు గాయాలయ్యాయి. సుమారు 600 కోళ్లు మృతి చెందగా.. రూ.1.50లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం కటక్‌కు చెందిన డ్రైవర్ సుశాంక్‌నాయక్(40), క్లీనర్ దీపక్‌నాయక్ ముడి ఐరన్(ఐరన్ రాళ్లు)లోడుతో లారీలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు శనివారం రాత్రి బయలుదేరారు. వేకువజామున 5గంటల సమయంలో పలాసలోని కోసంగిపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి దాటిన తర్వాత రోడ్డుపక్కన ఆగి ఉన్న కోళ్లవ్యాన్‌ను లారీతో ఢీకొన్నారు. దీంతో కోళ్లవ్యాన్ బోల్తాపడి నుజ్జయింది. లారీ కూడా 500 మీటర్ల దూరంలో రోడ్డుపక్కన ఉన్న కాలువలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఐరన్ రాళ్లన్నీ క్యాబిన్‌పై పడి నుజ్జయింది. అందులోనే డ్రైవర్ చిక్కుకున్నాడు. ప్రమాదాన్ని గుర్తించిన లారీక్లీనర్ దీపక్‌నాయక్ రోడ్డుపైకి దూకి స్వల్పగాయాలతో బయటపడ్డాడు. జాతీయ రహదారి రెస్క్యూటీమ్, ఎస్ఐ ఎన్.చంద్రరావు తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్ సుశాంక్‌నాయక్ బతికి ఉంటాడని భావించారు. మూడు గంటలపాటు శ్రమించి ఎక్స్‌కవేటర్‌లతో లారీలో ఉన్న ముడి ఐరన్‌ను తొలగించారు. అనంతరం అతికష్టంపై క్యాబిన్‌ను తొలగించగా, డ్రైవర్ విగతజీవిగా కనిపించాడు. ఆ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# పిండిమరకు రూ.24 వేల బిల్లు



సత్తెనపల్లి : జూలై 21 (సందేశం టైమ్స్): స్మార్ట్ విద్యుత్ మీటర్లు వద్దు పాత మీటర్లే కావాలి అని సిపిఎం నాయకుల ఎదుట పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన పిండిమర నిర్వాహకులు కోట సీతారామస్వామి వాపోయారు. విద్యుత్ స్మార్ట్ మీరట్లకు వ్యతిరేకంగా సిపిఎం చేపట్టిన ప్రచారంలో భాగంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఇతర నాయకులు 25వ వార్డు గుడిపూడివారి వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా పిండిమరను నిర్వహిస్తున్న వ్యక్తితో నాయకులు మాట్లాడగా ఆయన తన ఆవేదనను వివరించారు. స్మార్ట్ మీటర్ బిగించినప్పటి నుండి కరెంట్ బిల్లు అనేక రెట్లు ఎక్కువగా వస్తోందని చెప్పారు. రెండు మోటార్లు, ఒక లైటు, ఫ్యాను ఉంటాయని, గతంలో రూ.2-3 వేల బిల్లు వచ్చేదని, స్మార్ట్ మీటర్ బిగించాక ఈనెల రూ.9 వేలు వచ్చిందని చెప్పారు. బిల్లు భారీగా వచ్చింది.. పరిశీలించాలని విద్యుత్ శాఖాధికారులను సంప్రదించగా వారు ఆ బిల్లులను చూసి రూ.24,360 బిల్లు వచ్చినట్లు చెప్పారని, అంతెందుకొచ్చిందని ప్రశ్నించగా అదేమీ మాకు తెలియదు.. ఎంత వస్తే అంత కట్టాల్సిందే.. అని చెప్పారని సీతారామస్వామి వాపోయారు. మీటరులో లోపాలున్నాయేమో చూసి మార్చాలని కోరినా అదానీ కంపెనీ వారు బిగించిన మీటరును అ కంపెనీ వారే చూడాలిగాని తమకు సంబంధం ఉండదని చెప్పారని అన్నారు. తాను నెలలో 25 రోజులు షాపును తెరుస్తానని, ఈ లెక్కన రోజుకు రూ.వెయ్యి చొప్పున బిల్లు వస్తోందని సీతారామస్వామి చెప్పారు. తనుకు రోజు మొత్తం వచ్చే ఆదాయమే రూ.వెయ్యి ఉండదని, ఇహ అంత బిల్లును ఎలా చెల్లించగలనని ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్‌ను తీసేసి పాతమీటరే పెట్టాలని కోరారు.

# విద్యార్థుల సైకిళ్లకు నగదు పంపిణీ



ఆమదాలవలస,జూలై 21 (సందేశం టైమ్స్): దూసి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదు వుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఉపాధ్యాయులు సొంత నిధులతో సైకిళ్లు కొనుగోలుకు ఏర్పాటు చేశారు. ఈ మేరకు ఒక్కో విద్యా ర్థికి రూ.5 వేలు వంతున మొత్తం 12 మందికి నగదును డీఈవో తిరుమల చైతన్య ఆధ్వర్యం లో ఎమ్మెల్యే కూన రవికుమార్ విద్యార్థులకు అందజేశారు. తోటాడ, అక్కివరం పంచాయతీలకు చెందిన 12 మంది విద్యార్థులు దూసి హైస్కూల్‌కు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నందున ఉ పాధ్యాయులు సైకిళ్లను కొనుగోలు చేసి ఇవ్వాలని భావించడం అభినం దనీయమన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవి కుమార్, డీఈవో తిరుమల చైతన్య, ఎంఈవో రాజేంద్ర ప్రసాద్ ఉ పాధ్యాయులను అభినం దించారు.

# పేరుకే పెద్దాసుపత్రి




శ్రీకాకుళం రిమ్స్, జూలై 21 (సందేశం టైమ్స్): అది జిల్లాకే పెద్దాసుపత్రి. జిల్లా నలుమూలల నుంచి అత్యవసర, ప్రమాదకర స్థితిలో ఉన్న కేసులు ఇక్కడికే రిఫరల్‌పై వస్తుంటాయి. 24 గంటలు ఆసుపత్రిలో సేవలు అందించాలి. కానీ సమస్యల నడుమ సక్రమంగా సేవలు అందక రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్-రిమ్స్)లో దుస్థితి. ఈ పెద్దాసుపత్రిలో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోంది. చీకట్లోనే రోగులు ఉండాల్సిన పరిస్థితి ఎదరవుతోంది. 930 పడకల ఆసుపత్రిలో పనిచేసేది కేవలం ముగ్గురు ఎలక్ట్రీషియన్లే. అందులోను ఒక్కరే పర్మినెంట్ ఉద్యోగి. దీనికి తోడు దశాబ్దాల కిందట వేసిన విద్యుత్ కేబుల్ వైర్లు. వెరసి తరచుగా విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, షార్ట్ సర్క్యూట్‌లు సర్వసాధారణమై పోయాయి. సుమారు రెండు నెలల కిందట చిన్నపిల్లల వార్డులో షార్ట్‌సర్క్యూట్‌తో కేబుల్ వైర్లు కాలిపోయాయి. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పిపోయింది. అలాగే మూడు రోజుల కిందట ప్రసూతి వార్డులో అర్ధరాత్రి సమయంలో సుమారు నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గర్భిణీలు, బాలింతలు, పసిబిడ్డలు నరకయాతన అనుభవించారు. పాత కే బుల్ కాలిపోవడం వల్లనే ఈ ఇబ్బంది తలెత్తింది. నిజానికి ఆసుపత్రికి సంబంధించి సబ్‌స్టేషన్, పవర్ ప్యానెల్స్, జనరేటర్స్, కేబుల్స్ మెయింటెనెన్స్ చేయాల్సిన బాధ్యత కూడా ఎలక్ట్రీషియన్లదే. కానీ ఉన్నదేమో కేవలం ముగ్గురే. రోజుకు మూడు షిఫ్టుల్లో పనిచేయాల్సి ఉంటుంది. మరి ముగ్గురితో మొత్తం నిర్వహణ ఎలా సాధ్యపడుతుందో ఆ అధికారులకే ఎరుక. దీనికి సంబంధించి ఏపీఎంఎస్ఐడీసీ ఇంజినీరింగ్ విభాగం మెయింటెనెన్స్ సిబ్బందిని సుమారు పదిమంది క్వాలిఫైడ్ ఎలక్ట్రీషియన్లు, అలాగే ఆసుపత్రికి సంబంధించి మరో పదిమంది ఎలక్ట్రీషియన్ల అవసరం ఉంది. ఐదు లిఫ్టులు ఉండగా.. కేవలం ఒక్కరే ఆపరేటర్ ఉన్నాడు. లిఫ్టులు కూడా తరచూ మొరాయిస్తూనే ఉన్నాయి. గైనిక్ వార్డులోని లిఫ్ట్ సంవత్సరం పొడవునా పాడవుతూనే ఉంటోంది. అధికారులు వస్తున్నారు. వెళ్తున్నారు. నాయకులు తరచు పరిశీలించడం, హామీలు ఇవ్వడం తప్ప సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు,పాలకులు స్పందించి జీజీహెచ్‌లో సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# మోకాళ్లు, ఒంటికాలిపై నిలబడి నిరసన



పిడుగురాళ్ల, సత్తెనపల్లి :జూలై 21 (సందేశం టైమ్స్): తమ సమస్యల పరిష్కారం కోసం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారమూ కొనసాగింది. ఇందులో భాగంగా పిడుగురాళ్లలో ఒంటికా లిపైన, సత్తెనపల్లిలో మోకాళ్లపైన నిలబడి కార్మికులు నిరసన తెలిపారు. సమ్మె శిబిరాల వద్ద సిఐటియు పిడుగురాళ్ల మండల కార్యదర్శి టి.శ్రీనివాసరావు, సత్తెనపల్లి పట్టణ కన్వీనర్ జె.రాజ్‌కుమార్ మాట్లాడారు. 8 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని, చర్చలకు పిలిచి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని విమర్శించారు. ఇంజనీరింగ్ కార్మికులకు జీవో 36 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, స్కిల్డ్, సెమీస్కిల్డ్ ప్రకారం వేతనాలు నిర్ణయించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. షరతులేమీ లేకుండా సంక్షేమ పథకాలను వర్తింపజేయాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, 12వ పిఆర్సి ప్రకారం వేతనాలు చెల్లించాలని, గత సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. చనిపోయిన కార్మికుల స్థానాంలో వారి కుటుంబీకులకు అవకాశంకల్పించాలన్నారు. ఈ అంశాలన్నింటినీ పరిష్క రించే వరకూ సమ్మె కొనసాగుతుందని ఉ ద్ఘాటించారు. పిడుగురాళ్ల సమ్మె శిబిరంలో గన్నెపూడి విజరు ,పూర్ణ చందర్రావు, సుభాని, విజయ సారథి, సురేష్, మొగిలి నాగేశ్వరరావు, వాసా ప్రతాపు, కంప సాగర్‌బాబు, గద్దె శ్రీనివాసరావు, మొగిలి ప్రతాప్, దేవరకొండ మార్తమ్మ, ఏదుల లక్ష్మి, చల్లా పద్మ, మొగిలి నాగేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వర్లు, దేవుళ్ళ చిన్న వెంకటేశ్వర్లు, బెక్కంటి రామయ్య, తిరుపతిరావు, కొమర గురవయ్య పాల్గొన్నారు. సత్తెనపల్లి సమ్మె శిబిరంలో సిహెచ్ వెంకయ్య, చంద్రకళ, జల్ది రమేష్, సిహెచ్ సునీత, దుర్గ, కుమార స్వామి, జానీ, థామస్ ఇతర కార్మికులు పాల్గొన్నారు.

# వర్షం వస్తే చాలు.. ఆ రోడ్లు చెరువులే



దువ్వూరు/రాజుపాళెం,జూలై 21 (సందేశం టైమ్స్): కొద్దిపాటి వర్షం వస్తేచాలు దువ్వూ రు, రాజుపా ళెం మండలంలోని కొన్ని గ్రామాల్లోని రోడ్లు చెరు వులను తలపిస్తున్నాయి. దువ్వూరు మండలం లోని జిల్లేళ్ల గ్రామంలో స్వల్ప వర్షానికే రోడ్డుపై నీరు నిలిచి కుంటను తల పిస్తోంది. దీంతో గ్రామ ప్రజలు ఇక ట్లకు గురవుతున్నారు. కొన్నేళ్ల కిందట వేసిన సిమెంటు రోడ్డు పాడైంది. ఎందుకో ఈదారి వెంబడి గ్రావెల్‌ను తోలారు. ఇలా సిమెంటు రోడ్డు మీద గ్రావెల్ పరచడంతో ఇబ్బంది కలుగుతుందని గ్రామస్థులు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి పద్మజను వివరణ కోరగా సిమెంటు రోడ్డు మీద గ్రావెల్ తోలిన మాట వాస్తవమని, ఈ విషయాన్ని అదికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇక రాజుపాలెం మండలంలోని అర్క టవేముల, తొండలదిన్నె, టంగుటూరు, రాజుపా లెం తదితర గ్రామాల్లో రోడ్లన్నీ తగ్గుగా ఉండడం తో వర్షాలు పడినప్పుడు నీరు నిలిచి పాదాచారు లు సైతం వెళ్లడానికి

# అత్యాచారయత్నం.. ఆపై బెదిరింపులు భయంతో దివ్యాంగురాలి ఆత్మహత్య



సరూర్‌నగర్, జూలై 21 (సందేశం టైమ్స్): యువకుడి వేధింపులు భరించలేక ఓ దివ్యాంగురాలు ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన హైదరాబాద్‌లోని మీర్‌పేటలో జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లా అన్నంగి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి 12 ఏళ్ల క్రితం కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వచ్చి అల్మాసగూడలో నివాసముంటున్నారు. ఆయనకు ఓ కుమారుడు, ఇద్దరు దివ్యాంగ (చెవిటి, మూగ) కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె ఇంటి వద్ద టైలరింగ్ చేస్తుంది. ఈ క్రమంలో వారి ఇంటికి ఎదురుగా ఉ ఒడే శ్రీకాంత్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. 20 రోజుల క్రితం ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతిపై శ్రీకాంత్ అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు.ఆమె ప్రతిఘటించడంతో అక్కడి నుంచి పారిపోయాడు. మనస్తాపానికి గురైన యువతి బ్లేడ్‌తో గొంతు కోసుకొని ఆత్మహత్యకు యత్నించింది, కుటుంబసభ్యులు గమనించి ఆస్పత్రికి తరలించడంతో కోలుకుంది. ఇంటికొచ్చిన తర్వాత కూడా శ్రీకాంత్ వేధింపులు ఆగలేదు. తల్లిదండ్రులకు విషయం చెబితే చంపేస్తానని శ్రీకాంత్ బెదిరించాడని చెల్లెలికి తెలిపింది. ఈ క్రమంలో తనవల్ల తల్లిదండ్రులకు ప్రాణభయం ఉందన్న భయంతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శ్రీకాంత్ వేధింపులు భరించలేక తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని బాధిత యువతి తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కరిచిన పెంపుడు కుక్క.. రేబీస్‌తో యజమాని మృతి



మేళ్లచెరువు,జూలై 21 (సందేశం టైమ్స్): ఎంతో అల్లారుముద్దుగా పెంచుకుంటున్న పెంపుడు కుక్కే తమ ఇంట్లో విషాదాన్ని నింపుతుందని ఆ కుటుంబసభ్యులు ఊహించలేదు. దానిపై దాడి చేసిన వీధికుక్కలను యజమాని తరుముతుండగా పొరపాటున పెంపుడు కుక్క ఆయన్ను కరవడంతో రేబిస్ సోకి మరణించారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వు మండలం కందిబండ గ్రామంలో జరిగింది. కందిబండ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రి దక్కం మధు (42) కొంతకాలంగా ఇంట్లో ఓ కుక్కను పెంచుకుంటున్నారు. గత నెల 20వ తేదీన ఆ కుక్కపై కొన్ని వీధి కుక్కలు దాడిచేశాయి.వాటిని మధు తరుముతుండగా పొరపాటున పెంపుడు కుక్క ఆయన్ను కరిచింది. వెంటనే ఆయన మేళ్లచెర్వు ప్రాథమిక వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందారు. ఈ క్రమంలో ఆయనకు రేబిస్ సోకింది. వ్యాధి తీవ్రం కావడంతో కుటుంబసభ్యులు ఈ నెల 15వ తేదీన హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు ఇంటికి తిరిగొచ్చారు. ఈ క్రమంలో రేబిస్ వ్యాధి ముదిరి మధు ఇంట్లోనే మృతి చెందారు.

# చదువుతోనే సమాజమార్పు సాధ్యమవుతుంది: బామ్‌సేఫ్ శ్రీధర్



జూలై 21 (సందేశం టైమ్స్): చదువుతోనే సమాజ మార్పు సాధ్యమవుతుందని బామ్ సెఫ్ నేషనల్ క్యాడర్, తెలంగాణ ఇంచార్జ్ నల్ల శ్రీధర్ అన్నారు. రామవరం లోని ఎస్సిబి నగర్ మోడర్న్ ఇక్రా స్కూల్లో జరిగిన బామ్ సెఫ్ క్యాడర్ క్యాంపులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. చరిత్ర లో ఏం జరిగింది, జరుగుతుంది, జరగబోతుందనే విషయాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చరిత్ర, సమాజంపై మిడిమిడి జ్ఞానం చాలా నష్ట దాయకమని తెలిపారు. విద్య లేకపోతే, విజ్ఞానం లేకుండాపోతోంది, విజ్ఞానం లేకపోతే నైతికత లేకుండా పోతుంది, నైతికత లేకపోతే ఐక్యత లేకుండా పోతుందన్నారు.భారతదేశ సామాజిక ఉద్యమకారులైన వారిని నిత్యం మనం చేసుకోవాలన్నారు. బిర్సా ముండ ఆధ్వర్యంలో 17వ శతాబ్దంలోనే మా భూమి మాదేనంటూ, స్వాతంత్ర ఉద్యమం నడిపి విముక్తి కోసం పోరాటం చేసిన ఘనత మనకి ఉందన్నారు. కేరళలో నారాయణ గురు ప్రజలందరినీ గుడులకు అనుమతించాలని ఉద్యమించడమే కాకుండా, వందలాది గుడులను నిర్మించి విద్య నేర్పించారని తెలిపారు. 1902లోనే మొదటిసారి 50% రిజర్వేషన్లను అమలు చేసిన సాహు మహారాజ్ ఆదర్శనీయుడని కొనియాడారు. మద్రాస్ లో పెరియార్ ఇ.వి.రామసామి నేతృత్వంలోనే అందరికీ సమానత్వాన్ని అమలు చేశారన్నారు.

# నీ బిడ్డలం..బోనమందుకో తల్లి.. కొత్తగూడెంలో వైభవంగా బోనాల పండుగ



రామవరం,జూలై 21 (సందేశం టైమ్స్): ఆషాఢ మాసం పురస్కరించుకొని సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని కార్మిక ప్రాంతాలలో పండుగ వాతావరణం కనిపించింది. ఎక్కడ చూసినా గ్రామ దేవత అయిన పెద్దమ్మ తల్లి బోనాల జాతర ఘనంగా నిర్వహించుకున్నారు. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో నిర్వహించే ఈ బోనాలలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఉద్దేశంతో నీ బిడ్డలం బోనమెత్తినము మమ్ము సల్లంగా చూడు తల్లి అంటూ మొక్కులు చెల్లించుకున్నారు.

# పోలీసులపై ముల్తానీల రాళ్ల దాడి



ఇచ్చోడ,జూలై 21 (సందేశం టైమ్స్): :అటవీ భూముల్లో మొక్కలు నాటడానికి అటవీ అధికారులు, పోలీసులు వెళ్లగా.. తమ భూముల్లో మొక్కలు నాటొద్దంటూ ముల్తానీలు(పోడు రైతులు) వారిపై రాళ్ల దాడి చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం సిరిచెల్మ అటవీ పరిధిలోని కేశవపట్నం గ్రామంలో గత రెండు రోజులుగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జరిగిన దాడిలో ఇచ్చోడ ఎస్ఐ సహా 8 మంది పోలీసులకు గాయాలయ్యావగా.. వారి వాహనం ధ్వంసం అయ్యింది. వెంటనే వారిని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కాగా, ప్రతీ ఏటా ఈ అటవీ ప్రాంతంలో అధికారులు మొక్కలు నాటుతుంటారు. అందులో భాగంగానే శనివారం సిరిచెల్మ అటవీ పరిధిలోని 172, 174 కంపార్ట్‌మెంట్లలో మొక్కలు నాటేందుకు అధికారులు.. వారి భద్రత కోసం పోలీసులు వెళ్లారు.అక్కడి భూములు సాగు చేస్తున్న ముల్తానీలు.. నాటిన మొక్కలను పీకేసి ఆ భూములు తమవేనని, తమ భూముల్లో మొక్కలు నాటవద్దని అధికారులతో వాగ్వాదానికి దిగారు. తమ జోలికి వస్తే ఇక్కడే కొడవళ్లతో ఆత్మహత్యలు చేసుకుంటామని.. అక్కడున్న మహిళా రైతులు బెదిరించడంతో అ?ధికారులు వెళ్లిపోయారు. తిరిగి ఆదివారం ఉదయం అధికారులు, పోలీసులు పకడ్బందీగా గ్రామానికి వెళ్లగా.. గ్రామస్థులంతా ఏకమై పోలీసులపై దాడి చేశారు. దీంతో కేశవపట్నంలో భారీగా పోలీసులను మోహరించారు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ ఇచ్చోడ పోలీసు స్టేషన్‌కు చేరుకుని పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. పోడు భూముల సమస్యపై అటవీ అధికారులతో చర్చలను కొనసాగించారు.

# హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం



. హైదరాబాద్ జూలై 21 (సందేశం టైమ్స్): తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంలో వరుసగా నాలుగో రోజు వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. అంబర్‌పేట్, తార్నాక, ఉప్పల్, హబ్సిగూడ, మలక్ పేట, చాదర్‌ఘాట్, సైదాబాద్, సంతోష్ నగర్, హిమాయత్ నగర్, నల్లకుంటతోపాటు బషీర్‌బాగ్‌లో భారీ వర్షం కురుస్తుంది.%బంగాళాఖాతంలో ఉపరితల ద్రోణి అవరించి ఉంది. దీంతో జులై 24వ తేదీన ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఆ క్రమంలో రెండు రోజుల పాటు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావారణ శాఖ వెల్లడించింది. అలాగే తెలంగాణలో పలు జిల్లాల్లో భారీ వర్షం కురవనుందని సూచించింది. అందులో భాగంగా హైదరాబాద్ సహా 10 జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. అలాగే మరో 15 జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను వాతావరణ శాఖ జారీ చేసింది. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. మరోవైపు శనివారం భాగ్యనగరంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచించింది. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేసింది. మరోవైపు హైదరాబాద్‌లో భారీ వర్షాలపై సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో చర్చిస్తూ.. కీలక సూచనలు చేస్తున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు రావాలని ప్రజలకు ఆయన సూచించారు.

# యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలగకూడదు : వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్



మాగనూరు జూలై 21 (సందేశం టైమ్స్): : రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుకుండా చూసుకోవాలని నారాయణపేట్ జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ అన్నారు. ఆదివారం మాగనూరు మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతు ఆగ్రో సేవ కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీలు చేశారు. %రైతులకు యూరియా సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు కలుగ కుండా, ప్రస్తుత అవసరాలకు మేర రైతులు యూరియా కొనుగోళ్లు చేయాలన్నారు. చాలా మంది రైతులు ముందస్తుగానే రెండవ, మూడవ దఫా ఎరువులు కొని దాచుకుంటున్నారు. అలా కాకుండా ఎప్పుడు అవసరం ఉంటే అప్పుడే కొనుగోలు చేయాలని కోరారు. మార్కెట్ నుండి ఎప్పటికప్పుడు యూరియా సరఫరా చేస్తాం అని తెలిపారు.ప్రస్తుతం ప్రాథమిక వ్యవసాయ సహకారం కేంద్రంలో 1500 బస్తాలు, రైతు ఆగ్రో సేవా కేంద్రంలో 500 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, ప్రతిరోజు కూడా వస్తూ ఉంటుందని, రైతులు అధైర్య పడవద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాగనూరు మండల వ్యవసాయ అధికారి సుదర్శన్ గౌడ్, పిఏసిఎస్ చైర్మన్ వెంకటరెడ్డి రైతు అగ్రో సేవా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భద్రాచలం గిరిజన హాస్టల్‌లో విద్యార్థినులకు పురుగులన్నం



భద్రాచలం జూలై 21 (సందేశం టైమ్స్): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని ప్రభుత్వ గిరిజన బాలికల హాస్టల్‌లో గత మూడ్రోజులుగా అన్నంలో పురుగులు వస్తున్నాయి. పురుగులు పట్టిన ఆహారం మాకు పెట్టొద్దంటూ విద్యార్థినులు కళాశాల ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. శనివారం ఉదయం సైతం అల్పాహారం కోసం చేసిన 80 కిలోల కిచిడిలో పురుగులు ఎక్కువగా దర్శనమివ్వడంతో 600 మంది విద్యార్థులు తినకుండానే కళాశాలలోని తరగతి గదులకు వెళ్లి నిరసన తెలిపారు తాము మూడ్రోజులుగా ఫిర్యాదు చేస్తున్నా ప్రిన్సిపాల్ పట్టించుకోవడం లేదని విద్యార్థినులు వాపోయారు. భద్రాచలం ఐటీడీఏ ప్రధాన కేంద్రానికి దగ్గరగా ఉన్న ఈ కళాశాలలో ఇలాంటి సంఘటన చోటుచేసుకోవడం విస్మయానికి గురిచేస్తోంది.



# క్రీడావార్తలు



## అన్షుల్‌కు పిలుపు




మాంచెస్టర్: సిరీస్ లో సజీవంగా ఉండేందుకు నాలుగో టెస్టులో విజయంపై దృష్టి సారించిన టీమిండియాకు ఆరంభంలోనే ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. స్టార్ పేసర్ బుమ్రాకు విశ్రాంతినిచ్చి అతడి స్థానంలో యువ లెఫ్టామ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్‌కు అవకాశం ఇస్తారని అంతా భావించారు. కానీ రెండు రోజుల క్రితం గాయం కావడంతో మాంచెస్టర్ టెస్టుకు అర్ష్‌దీప్ అందుబాటులో ఉ ఒడడం లేదు. ప్రాక్టీస్ సమయంలో బంతిని ఆపుతుండగా అర్ష్‌దీప్ ఎడమ చేతికి గాయమైంది. అలాగే మరో పేసర్ ఆకాశ్ దీప్‌నకు గజ్జల్లో గాయం కావడంతో అతను కూడా నాలుగో టెస్టుకు దూరం కానున్నాడు. లార్డ్స్ టెస్టు నాలుగో రోజు ఆటలో అతను చికిత్స కోసం మైదానం కూడా వీడాడు. అటు బెకెన్‌హామ్‌లో జరిగిన జట్టు ప్రాక్టీస్ సెషన్‌లోనూ ఆకాశ్ బౌలింగ్ చేయలేదు. ప్రస్తుతం ఇద్దరూ జట్టుతో పాటే మాంచెస్టర్‌కు వెళ్లినా వీరి గాయం తీవ్రతపై సోమవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అన్షుల్ జట్టులోకి..: ఇద్దరు పేసర్లు గాయపడడంతో ముందు జాగ్రత్తగా హరియాణాకు చెందిన 24 ఏళ్ల పేసర్ అన్షుల్ కాంబోజ్‌ను బ్యాకప్ కోసం ఇంగ్లండ్‌కు రప్పించనున్నారు. తాజా సిరీసకు ముందు అన్షుల్ భారత్ 'ఏ' తరఫున ఇంగ్లండ్ 'ఏ'తో రెండు అనధికార టెస్టులు ఆడాడు. అన్షుల్ రెండో మ్యాచ్‌లో నాలుగు వికెట్లతో ఆకట్టుకోవడంతో పాటు బ్యాటింగ్‌లోనూ తనుష్ కోటియన్‌తో కలిసి అజేయంగా 149 పరుగుల భాగస్వామ్యాన్ని అందించాడు. దీంతో భారత్ 'ఏ' జట్టు ఓటమి నుంచి తప్పించుకొని మ్యాచ్‌ను డ్రా చేయగలిగింది.

## తప్పంతా నాదే.. శ్రీశాంత్‌తో వివాదంపై హర్భజన్ సింగ్ కామెంట్




ఇంటర్నెట్ డెస్క్: తన కేరీర్ నుంచి శాశ్వతంగా తుడిచి పెట్టేయాలనుకునే ఘటన శ్రీశాంత్‌తో వివాదమేనని టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ అన్నాడు. ఈ వివాదంలో తప్పంతా తనదేనని విచారం వ్యక్తం చేశాడు. ఐపీఎల్ 2008 ఎడిషన్‌లో జరిగిన ఈ ఉదంతంపై హర్భజన్ తాజాగా ఆర్ అశ్విన్ ఛానల్ 'కుట్టి స్టోరీస్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడాడు. నాటి ఐపీఎల్‌లో హర్భజన్ శ్రీశాంత్‌పై చేయి చేసుకోవడం కలకలం రేపిన విషయం తెలిసిందే. %తన టాక్ షోలో అశ్విన్ మాట్లాడుతూ హర్భజన్ తన కెరీర్‌లోంచి తుడిచిపెట్టేయాల్సిన ఘటన ఏమైనా ఉందా అని ప్రశ్నించాడు. దీనికి హర్భజన్ మనసులో ఉన్నది ఉన్నట్టుగా చెప్పుకొచ్చాడు. 'నేను తుడిచి పెట్టేయాలనుకునే ఒకే ఒక ఘటన శ్రీశాంత్‌తో వివాదమే. అసలు ఆ సమయంలో జరిగింది పూర్తిగా తప్పే. నేను అలా చేసుండాల్సింది కాదు. ఈ విషయంలో ఇప్పటికే 200 సార్లకు పైగా క్షమాపణలు చెప్పి ఉంటా. ఇది జరిగి ఇన్నేళ్లు గడిచిపోయినా ఇప్పటికీ బాధ కలుగుతుంది. సందర్భం దొరికిన ప్రతిసారీ ప్రతి వేదికపైనా నేను క్షమాపణలు చెబుతూనే ఉన్నా. మనందరం పొరపాట్లు చేస్తాము. మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా ప్రయత్నిస్తాము. అతడు నా జట్టు సభ్యుడు. ఇద్దరం కలిసి ఆడుతున్నాం. ఆ గేమ్‌లో మేము ప్రత్యర్థులమన్న మాట వాస్తవమే. కానీ వివాదం అంతలా ముదిరి ఉ ఒడాల్సింది కాదు"'ఈ విషయంలో తప్పు నాదే. అతడు చేసిన తప్పు ఏదైనా ఉంది అంటే అది నన్ను రెచ్చగొట్టడమే. అతడు చేసిన దాంట్లో పెద్దగా తప్పు పట్టాల్సింది ఏమీ లేదు. కానీ నేను చేసింది మాత్రం చాలా పెద్ద తప్పు' అంటూ హర్భజన్ ఎమోషనల్ అయ్యాడు. 'ఆ వివాదంపై శ్రీశాంత్ కూతురు అన్న మాటలు నన్ను ఇప్పటికీ బాధిస్తున్నాయి. ఓ సందర్భంలో ఆమెతో నేను ఆప్యాయంగా మాట్లాడుతున్నప్పుడు నాతో మాట్లాడటం తనకు ఇష్టం లేదని ఆమె చెప్పింది. నువ్వు మా నాన్నపై చేయి చేసుకున్నావు అని అన్నది. ఆ మాటలు నా గుండెను ముక్కలు చేశాయి. కన్నీళ్లు ఉబికివచ్చినట్లైంది. ఆ చిన్నారిపై ఎంతటి ప్రభావం కలిగిందో అన్న బాధ కలిగింది. నా గురించి తను ఏమనుకుంటోందో అని తెగ కలత చెందాను. తన తండ్రిపై చేయి చేసుకున్న వ్యక్తిగా నేను మిగిలిపోయాను'

## సిరీస్ కు హంపి



బటూమి (జార్జియా): తెలుగు గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి.. ఫిడే మహిళల వరల్డ్‌కప్‌లో సంచలన ప్రదర్శన చేసింది. ఈ మెగా టోర్నీలో సెమీఫైనల్‌కు దూసుకెళ్లి స్వర్ణానికి మరింత చేరువైంది. చైనా క్రీడాకారిణి యుక్సిన్ సాంగ్‌తో క్వార్టర్‌ఫైనల్ పోరులో శనివారం తొలి గేమ్ గెలిచిన హంపి.. ఆదివారం జరిగిన రెండో గేమ్‌ను డ్రా చేసుకొంది. దీంతో హంపి 1.5-0.5 ఆధిక్యంతో యుక్సిన్‌పై గెలిచి తొలిసారి సెమీఫైనల్ బెర్త్ ఖరారు చేసుకొంది. ఈ క్రమంలో.. ఫిడే మహిళల వరల్డ్ కప్‌లో సెమీస్ చేరిన తొలి భారత మహిళగా హంపి రికార్డు సృష్టించింది. కాగా, భారత్‌కు చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ వైశాలి టోర్నీ నుంచి నిష్క్రమించింది. టాన్ జోంగి (చైనా)తో క్వార్టర్స్‌లో తొలి గేమ్‌ను డ్రాగా ముగించిన వైశాలి.. రెండో గేమ్‌లో ఓటమి పాలైంది. దీంతో వైశాలి 0.5-1.5తో టాంగ్ చేతిలో ఓడి టోర్నీ నుంచి వెనుదిరిగింది. ఇక.. భారత్‌కే చెందిన ద్రోణవల్లి హారిక, దివ్యా దేశ్‌ముఖ్ మధ్య క్వార్టర్స్ పోరులో రెండో గేమ్ కూడా డ్రాగా ముగిసింది. దీంతో ఇద్దరూ 1-1తో సమంగా నిలవడంతో.. ఫలితం కోసం టైబ్రేక్‌లో తలపడనున్నారు.

## పాక్‌తో ఆడేది లేదు



బర్మింగ్‌హామ్: వరల్డ్ చాంపియన్‌షిప ఆఫ్ లెజెండ్స్ (డబ్ల్యూసీఎల్)ను ఇండో-పాక్ ఉద్రిక్తతలు కుదిపేశాయి. టీమిండియా మాజీ స్టార్లు బాయ్‌కాట్ చేయడంతో.. భారత్, పాకిస్థాన్ వెటరన్ జట్ల మధ్య ఆదివారం జరగాల్సిన మ్యాచ్‌ను నిర్వాహకులు రద్దు చేయాల్సి వచ్చింది. గత ఏప్రిల్‌లో జరిగిన పహల్గాం ఉగ్రదాడికి నిరసనగా శిఖర్ ధవన్ సహా మరికొందరు భారత వెటరన్ క్రికెటర్లు పాకిస్థాన్‌తో మ్యాచ్ ఆడేందుకు నిరాకరించారు. డబ్ల్యూసీఎల్‌ను ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ), బాలీవుడ్ నటుడు అజయ్ దేవగణ్ సంయుక్తంగా నిర్వహిస్తున్నారు. రెండో అంచె జూన్ 18న ఆరంభం కాగా.. వచ్చే నెల 2న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ భారత జట్టుకు సారథ్యం వహిస్తుండగా.. ధవన్, హర్భజన్, యూసుఫ్ పఠాన్, ఇర్ఫాన్ పఠాన్, రైనా, ఊతప్ప, ఆరోన్ జట్టు సభ్యులు. పాక్ జట్టు కెప్టెన్‌గా షాహిద్ అఫ్రీది వ్యవహరిస్తున్నాడు.

## నాకు దక్కిన గొప్ప గౌరవం




లండన్: భారత్-ఇంగ్లండ్ జట్ల మధ్య జరుగుతున్న టెస్టు సిరీస్‌ను అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీగా పిలుచుకుంటున్నారు. అయితే దిగ్గజ సచిన్ పేరు పక్కన తన పేరు చూసి గర్వంగా భావించినట్టు అండర్సన్ తెలిపాడు. 'క్రికెట్‌లో సచిన్ ఓ దిగ్గజ ఆటగాడు. అలాంటి క్రికెటర్‌తో కలిసి ట్రోఫీని పంచుకోవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నా. నిజానికి నేను అతడితో సరితూగగలనా? అని కూడా మనసులో అనుకున్నా. కానీ మన పేరుతో ట్రోఫీని నిర్వహించడమే చాలా గొప్ప విషయం. అది కూడా సచిన్ సరసన నాకు స్థానం దక్కడం ఎనలేని సంతోషాన్నిచ్చింది. చిన్నప్పటి నుంచి అతడి ఆటను చూసి పెరిగాను. ప్రత్యర్థిగానూ ఆడా' అని అండర్సన్ వివరించాడు.

## టెస్టు సిరీస్ కు నితీశ్ దూరం



మాంచెస్టర్: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు ఆరంభానికి ముందే భారత జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ మోకాలి గాయం కారణంగా మిగిలిన రెండు టెస్టులకు దూరమయ్యే అవకాశం ఉంది. ఆదివారం అతడు జిమ్‌లో వ్యాయామం చేస్తుండగా మోకాలికి గాయమైంది. స్కానింగ్‌లో లిగమెంట్ దెబ్బతిన్నట్టు తేలడంతో సిరీస్‌లో అతడు ఆడేది సందేహంగా మారింది. అయితే నితీశ్ గాయంపై బీసీసీఐ అ?ధికారికంగా ప్రకటించలేదు. తొలి టెస్టులో ఆడని నితీశ్‌కు ఆ తర్వాత రెండు టెస్టుల్లో చోటు కల్పించారు. అయితే లార్డ్స్ టెస్టులో 3 వికెట్లు, 43 పరుగులతో ఫర్వాలేదనిపించాడు.

## ఐసీసీ సంచలన అప్‌డేట్.. 2031 వరకు ఫైనల్స్ అక్కడే




అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తాజాగా జూలై 20, 2025న జరిగిన సమావేశంలో పలు కీలక నిర్ణయాలను ప్రకటించింది. వీటిలో వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్‌ఫైనల్ గురించి కీలక అప్‌డేట్ వచ్చింది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్‌లు 2031 వరకు ఇంగ్లండ్‌లోనే జరుగుతాయని తెలిపింది. ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్ (%జుజదీ%) ఈ ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహిస్తోందని, అందుకే 2027, 2029, 2031 ఎడిషన్‌ల హోస్టింగ్ హక్కులను కూడా ఇంగ్లండ్‌కు ఇచ్చినట్లు వెల్లడించింది. గతంలో సౌతాంప్టన్ (2021), ది ఓవల్ (2023), లార్డ్స్ (2025)లో ఈ ఫైనల్‌లు జరిగాయి. ఇంగ్లండ్‌లో జూన్ నెలలో వాతావరణం అనుకూలంగా ఉండటం, %జుజదీ% అద్భుతమైన నిర్వహణ వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. దీంతో క్రికెట్ అభిమానులకు ఈ ప్రతిష్మాత్మక మ్యాచ్‌లను ఇంగ్లండ్ మైదానాల్లో చూసే అవకాశం మరో ఆరేళ్లు కొనసాగనుంది. ఒకే చోట జరిగే నిర్ణయం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఐసీసీ తీసుకున్న నిర్ణయాలలో మహిళా క్రికెటర్లు, యూఎస్ఏ క్రికెట్ సంస్కరణలు, కొత్త అసోసియేట్ సభ్యుల ఎన్నిక వంటి అంశాలు కూడా ఉన్నాయి.

# బిజినెస్



## వచ్చే వారం రానున్న ఐపీఓలు ఇవే.. ఈసారి ఎన్ని వస్తున్నాయంటే..

దేశీయ స్టాక్ మార్కెట్లో  మళ్లీ ఐపీఓల ) వీక్ రానే వచ్చేసింది. గత కొన్ని వారాలుగా మార్కెట్లోకి కొత్త కంపెనీలు నిరంతరం వస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఈసారి దాదాపు 10 కొత్త కంపెనీలు మార్కెట్లోకి వస్తున్నాయి. ఇదే సమయంలో మరికొన్ని కంపెనీలు కూడా ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ కానున్నాయి. ఆ విశేషాలేంటో ఇక్కడ చూద్దాం.వచ్చే వారం రానున్న కొత్త కంపెనీలఇండిక్యూబ్ స్పేసెస్ ఐపీఓ: ఈ పరిమాణం రూ. 700 కోట్లు కాగా, ఇందులో రూ. 650 కోట్ల తాజా ఇష్యూ, రూ. 50 కోట్ల %వాఫీూ% వాటా ఉన్నాయి. ఇండిక్యూబ్ స్పేసెస ధర పరిధి ఈక్విటీ షేరుకు రూ.225 నుంచి రూ. 237 వరకు నిర్ణయించారు. దీని ముఖ విలువ రూ.1గా నిర్ణయించారు.

## తగ్గిన బంగారం, వెండి ధరలు.. ఎంతకు చేరుకున్నాయంటే..

బంగారం, వెండి ధరలు తగ్గుతాయని ఆశిస్తున్న వారికి కాస్త ఊరట లభించింది. ఎందుకంటే నిన్నటి ధరలతో పోల్చితే వీటి రేట్లు ఈరోజు (జూలై 21న) స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఈ నేపథ్యంలో గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 6.30 గంటల సమయానికి 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 00, 030కి చేరుకుంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 91, 690గా ఉంది.%ఇది నిన్నటి రేటుతో పోల్చుకుంటే స్వల్పంగా రూ.10 మాత్రమే తగ్గింది. ఈ రోజు ధరల తగ్గుదల స్వల్పమైనదే అయినప్పటికీ, పెద్ద మొత్తంలో పసిడి కొనుగోలు చేసే వారికి ఇది ఒక మంచి అవకాశంగా మారనుంది. మరోవైపు సామాన్యులు మాత్రం లక్షకు చేరుకున్న పసిడి ధరలను చూసి కొనుగోలు చేయాలా




వద్దా అని ఆలోచిస్తున్నారు.

## టాప్‌గేర్‌లో ఐపీఓ మార్కెట్




న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) మార్కెట్ కళకళలాడుతోంది. ఈ ఏడాది జనవరి-జూన్ మధ్య కాలంలో 24 కంపెనీలు ఐపీఓల ద్వారా రూ.45,351 కోట్లు సమీకరించాయి. గత ఏడాది ఇదే కాలంలో 36 కంపెనీలు సమీకరించిన రూ.31,281 కోట్లతో పోలిస్తే ఇది 45 శాతం ఎక్కువ. గత ఆరు నెలల్లో ఇష్యూల సంఖ్య తగ్గినా సమీకరించిన నిధులు పెరగడం విశేషం. ప్రైమరీ మార్కెట్లో నెలకొన్న ఈ జోరు డిసెంబరు వరకు కొనసాగుతుందని మార్కెట్ వర్గాల అంచనా. దేశీయ మదుపరులకు ఐపీఓలపై పెరుగుతున్న మోజు, లాభాలు ఇందుకు దోహదం చేయనున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, అనిశ్చితులు పెరిగినా భారత ఐపీఓ మార్కెట్ జోరు మీద ఉండడం విశేషం. గత ఏడాది తొలి ఆరు నెలల్లో 52 కంపెనీలు తమ ఐపీఓల కోసం సెబీకి దరఖాస్తు చేస్తే గత ఆరు నెలల్లో ఈ సంఖ్య ఏకంగా 118కు పెరిగింది. ఎన్ఐఆర్ఎల్ రూ.4,000 కోట్ల ఐపీఓ: ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్) అనుబంధ సంస్థ ఎన్ఐఆర్ఎల్ రూ.4,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతోంది. ఎన్ఎల్‌సీఐఎల్ సీఎండీ మోటుపల్లి ప్రసన్న కుమార్ ఈ విషయం ప్రకటించారు. వచ్చే ఏడాది సెప్టెంబరులోగా ఈ ఐపీఓ పూర్తి చేయాలని భావిస్తున్నట్టు చెప్పారు. ఎన్ఐఆర్ఎల్ పునరుత్పాదక ఇంధన వనరుల ప్రాజెక్టుల కోసం ఈ నిధులను వినియోగించనున్నట్టు చెప్పారు.24 నుంచి బ్రిగేడ్ హోటల్స్ ఇష్యూ: ఐపీఓ ద్వారా రూ.750 కోట్లు సమీకరించేందుకు బ్రిగేడ్ హోటల్ వెంచర్స్ ఈ నెల 24న క్యాపిటల్ మార్కెట్‌కు వస్తోంది. ఈ ఐపీఓ ద్వారా సమీకరించే రూ.750 కోట్లలో రూ.468.14 కోట్లు రుణ చెల్లింపులకు, రూ.197.52 కోట్లు ప్రమోటర్‌కే చెందిన కొంత స్థలం కొనుగోలుకు వినియోగిస్తారు. మిగతా నిధులను కంపెనీ వ్యాపార విస్తరణ కోసం వినియోగిస్తామని కంపెనీ తెలిపింది.నేటి నుంచే సావీ ఇన్‌ఫ్రా ఐపీఓ: గుజరాత్ కేంద్రంగా పనిచేసే ఈపీసీ కంపెనీ సావీ ఇన్‌ఫ్రా అండ్ లాజిస్టిక్స్ ఐపీఓ సోమవారం నుంచి ప్రారంభమవుతోంది. రూ.70 కోట్ల సమీకరణ కోసం మార్కెట్‌కు వస్తున్న ఈ ఎస్ఎంఈ కంపెనీ ఐపీఓ ఈ నెల 23న ముగుస్తుంది. ఈ ఇష్యూ ప్రైస్ బ్యాండ్‌ను రూ.114/120గా నిర్ణయించారు.

## ఆటో ఎగుమతుల జోరు




న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ఆటోమొబైల్ ఎగుమతులు 22 శాతం వృద్ధి చెందినట్లు భారత ఆటోమొబైల్ తయారీదారుల సమాఖ్య (సియామ్) వెల్లడించింది. ఈ కాలంలో మొత్తం ఎగుమతులు 14,57,461 యూనిట్లుగా ఉన్నాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇవి 11,92,566 యూనిట్లుగా ఉన్నాయి. ప్యాసింజర్ వాహన ఎగుమతులు రికార్డు స్థాయికి చేరటంతో పాటు ద్విచక్ర, వాణిజ్య వాహన విభాగాల్లో బలమైన పెరుగుదల ఈ వృద్ధికి కారణమని సియామ్ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో ప్యాసింజర్ వాహన ఎగుమతులు 2,04,330 యూనిట్లుగా ఉన్నాయి. పశ్చిమాసియా సహా అమెరికా మార్కెట్లలో స్థిరమైన డిమాండ్ కారణంగా ఎగుమతులు గణనీయంగా పెరిగాయని తెలిపింది. ఈ కాలంలో ద్విచక్ర, వాణిజ్య వాహన ఎగుమతులు 23 శాతం వృద్ధితో వరుసగా 11,36,942 యూనిట్లు, 19,427 యూనిట్లుగా ఉన్నాయి. జూన్ త్రైమాసికంలో దేశీయ కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ 96,181 యూనిట్లను ఎగుమతి చేసి మార్కెట్లో తన ఆధిపత్యాన్ని కొనసాగించింది.

## డాక్టర్ రెడ్డీస్ శ్రీకాకుళం ప్లాంట్‌పై ఎఫ్‌డీఏ అభ్యంతరాలు




న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం ప్లాంట్‌పై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ మండలి (యూఎస్ ఎఫ్‌డీఏ) ఏడు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ ఫారం-483 జారీ చేసిందని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వెల్లడించింది. ఈ నెల 10 నుంచి 18 వరకు ఈ ఫార్ములేషన్స్ ప్లాంట్‌లో ఎఫ్‌డీఏ తనిఖీలు చేపట్టి ఈ అభ్యంతరాలను లేవనెత్తిందని తెలిపింది. నిర్దేశిత గడువులోగా వీటిని సరిదిద్దుతామని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

## మదుపరులూ జాగ్రత్త

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మిశ్రమంగా చలించే అవకాశం ఉంది. భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై స్పష్టత వచ్చేంత వరకు ఊగిసలాట తప్పకపోవచ్చు. మరోవైపు అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు కీలకంగా మారుతున్నాయి. నిఫ్టీ సైతం 25,000 దిగువకు రావటం నెగటివ్ సెంటిమెంట్‌ను ప్రతిబింబిస్తోంది. ఏమైనా సానుకూల సంకేతాలు వస్తే సూచీలు బౌన్స్‌బ్యాక్ అయ్యే అవకాశం ఉంది. మదుపరులు అప్రమత్తంగా ఉండటం మంచిది.విప్రో: ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి డౌన్‌ట్రెండ్‌లో కొనసాగుతూ వస్తున్న ఈ షేరు ప్రస్తుతం కన్సాలిడేటెడ్ అవుతోంది. స్వల్ప,మధ్యకాలిక మూమెంటమ్ పర్వాలేదు. తాజా త్రైమాసిక ఫలితాల తర్వాత ఈ కౌంటర్‌పై ఆసక్తి పెరుగుతోంది. గత శుక్రవారం రూ.266 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.260 వద్ద పొజిషన్ తీసుకుని రూ.290 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.256 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.ఐసీఐసీఐ బ్యాంక్: ప్రస్తుతం ఈ



షేరు జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో కదలాడుతోంది. స్వల్ప, మధ్యకాలిక మూమెంటమ్ లేనప్పటికీ త్రైమాసిక ఫలితాల నేపథ్యంలో ఆసక్తి పెరిగింది. 20,50 రోజుల చలన సగటు వద్ద షేరు కన్సాలిడేట్ అవుతోంది. గత శుక్రవారం రూ.1,425 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.1,400 శ్రేణిలో బై ఆన్ డిప్స్ పద్ధతిలో పొజిషన్ తీసుకుని రూ.1,480/1,530 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,375 స్థాయిని స్టాప్‌లాసగా పెట్టుకోవాలి.బజాజ్ ఫైనాన్స్: నష్టాల మార్కెట్లోనూ ఈ షేరు బలాన్ని ప్రదర్శిస్తోంది. మూమెంటమ్, రిలేటివ్ స్ట్రెంత్ క్రమంగా మెరుగవుతోంది. టైట్ రేంజ్‌లో కన్సాలిడేట్ అవుతోంది. గత శుక్రవారం రూ.942 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.910/900 శ్రేణిలో ఎంటరై రూ.980/1,050 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు.

## విద్యార్థులకు యాపిల్ కంపెనీ బంపర్ ఆఫర్

యాపిల్ కంపెనీ విద్యార్థుల కోసం బంపర్ ఆఫర్ ప్రకటించింది. ఒక యాపిల్ ప్రొడక్ట్ కొంటే మరో ప్రొడక్ట్ ఫ్రీగా ఇస్తోంది. మీరు మ్యాక్ లేదా ఐపాడ్ కొంటే ప్రీమియమ్ యాక్సెసరీస్ ఎయిర్‌పోడ్స్, యాపిల్ పెన్సిల్, మ్యాజిక్ కీబోర్డ్, మ్యాజిక్ మౌస్ గెలుచుకునే అవకాశం ఉంది.ఈ ఆఫర్ స్టార్ట్ అయి చాలా రోజులు అయింది. జూన్ 17వ తేదీన ప్రారంభమైంది. సెప్టెంబర్ 30వ తేదీన ముగియనుంది. ఈ




ఆఫర్ కేవలం ఇండియాలో మాత్రమే అందుబాటులో ఉంది. అది కూడా యాపిల్ అఫిషియల్ వెబ్‌సైట్లలో మాత్రమే ఆఫర్ ఉంటుంది. లేదా 000800 040 1966 కాల్ చేసి కావాల్సిన వస్తువుల్ని కొనుక్కోవచ్చు.మీరు గనుక మ్యాక్ బుక్ ఎయిర్, మ్యాక్ బుక్ ఎయిర్, ఐమ్యాక్ కొంటే గనుక మీరు ఎయిర్‌పాడ్స్, ఎయిర్‌పాడ్స్ ప్రో 2, మ్యాజిక్ మౌస్, ట్రాక్‌పాడ్,

TGTEL/25/A0348 TITLE: Sandhesham Times 3-82,Ananthagiri, Singavaram, SURYAPET, Telangana,508 206 Gmail : sandeshamtimes@gmail.com Website:https://sandeshamtimes.com Publisher Press (Name & Address) SUNDAY PRINTING PRESS 3-4297,SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADHESH-522 006